సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 24 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



'సమగ్ర'లో సిమెంట్ దొంగలు

నాడు- నేడు పనుల కోసం సమగ్రశిక్షకు కేటాయించిన 35 లోడ్‌ల సిమెంట్ పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. 10లో

గరిష్టం/కనిష్టం
35.1°/22.4°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలిక పాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

13 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకూ 13 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రొళ్లలో 18.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ముదిగుబ్బలో 15.8 మిమీ, నల్లచెరువు 10.2 మిమీ, మడకశిర, అగళి మండలాల్లో 6.2 మిమీ, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 5.4 మిమీ, రొద్దం, 3.6 మిమీ, పుట్టపర్తి 3.4 మిమీ, రామగిరి 3.2 మిమీ వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: జూలై 22న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. ప్రజాప్రయోజనాల కేసుల్లో తప్పనిసరిగా పరిష్కారం పొందే విధంగా లోక్ అదాలత్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి డీఆర్‌ఓ కొండయ్య, అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

యువకుల హల్‌చల్



పోలీసుల అదుపులో ఉన్న యువకులు

ముదిగుబ్బ: వాహనానికి పోలీస్ సైరన్ బిగించుకుని హల్‌చల్ చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..అనంతపురం ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కొండప్ప కుమారుడు దిలీప్ తన స్నేహితులు కార్తీక్, బాబా ఫరూఖ్, భాస్కర్, మరో యువకుడితో కలిసి శుక్రవారం ఇన్నోవా వాహనంలో బత్రేపల్లి వాటర్ ఫాల్స్ వద్దకు వెళ్లారు. అనంతరం కదిరికి నుంచి ముదిగుబ్బ వైపు వస్తున్నండగా, మార్గమధ్యలో కాళసముద్రం వద్ద స్పీడ్ బ్రేకర్ రావడంతో కారు వేగం తగ్గించారు. ఈ సమయంలో వెనుకవైపు నుంచి వస్తున్న గాండ్లవారిపల్లికి చెందిన ఈశ్వరయ్య తన బైక్‌ను కంట్రోల్ చేయలేక కారుకు తగిలించాడు. దీంతో ఇన్నోవాలో ఉన్న ఐదుగురు యువకులు ఈశ్వరయ్యను చితలబాది బలవంతంగా ఫోన్‌పే ద్వారా డబ్బు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం వేగంగా వస్తూ ముదిగుబ్బ వద్ద నిలిచి ఉన్న ఆటోను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు అనంతపురం వైపు వెళుతున్న వాహనాన్ని కేజీబీవీ వద్ద అడ్డగించారు. వాహనాన్ని తనిఖీ చేసి 250 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. యువకులు కూడా మత్తులో ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పల్లెల్లోనూ ఫాస్ట్‌ఫుడ్



ఈ చిత్రంలోని వ్యాపారి పేరు మల్లికార్జున్. ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి ఓడీ చెరువు మండలం మహమ్మదాబాద్‌లో పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. రోజుకు సగటున రూ.2 వేలు వ్యాపారం అవుతోందని సంతోషంగా చెబుతున్నాడు.



ఇది రొద్దం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పానీ పూరి బండి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్లేష్ నిర్వహిస్తున్నాడు. రోజు సాయంత్రం బండి వద్ద జనాలతో కిక్కిరిసిపోతుంటారు. చక్కటి జీవనోపాధి లభిస్తోందని చెబుతున్నాడు.



ఈ పానీ పూరి బండిని తాడిమర్రిలో నార్త్ ఇండియన్స్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ఈ ప్రాంతం జనంతో కిటకిటలాడుతుంది. కట్లెట్, పానీపూరీకి మంచి గిరాకీ ఉంటోందని నిర్వాహకులు తెలిపారు.



- గ్రామాల్లోనూ కనిపిస్తున్న ఎగ్‌రైస్ బండ్లు
- ప్రధాన కూడళ్లలో పానీపూరి వ్యాపారం
- గోబీ, నూడుల్స్‌కు ఫుల్ డిమాండ్
- తండాలకూ పాకిన 'ఫాస్ట్' కల్చర్

సాక్షి, పుట్టపర్తి: బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లో మాత్రమే కనిపించే ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ నెమ్మదిగా.. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు దాటి.. పల్లెలకు వ్యాపించింది. పల్లెవాసులు కూడా పానీపూరి, గోబీ, నూడుల్స్‌కు అలవాటు పడ్డారు. ఆరోగ్యానికి చేటని తెలిసినా.. రుచికరంగా ఉంటుందని విపరీతంగా తింటున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఏ పల్లెలో చూసినా పానీపూరి బండ్లు వెలిశాయి. ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ నుంచి వలస వచ్చి వ్యాపారులు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఫలితంగా గతంలో జిల్లా వ్యాప్తంగా 200 లోపే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇప్పుడు వేలు దాటిపోయాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్నవన్నీ పల్లెల్లోననే కావడం గమనార్హం.

రుచికరంగా ఉంటుందని..

జంక్ ఫుడ్ ప్రమాదమని డాక్టర్లు చెబుతున్నా, యువత పెద్దగా పట్టించుకోవడం లేదు. సాయంత్రమైతే చాలు పానీపూరి బండి చుట్టూ చేరిపోయి ఎడాపెడా తింటున్నారు. చదువుల కోసం మెట్రో నగరాలకు వెళ్లి అక్కడ ఫాస్ట్ ఫుడ్ కల్చర్‌కు అలవాటు పడ్డారు. ఫలితంగా సొంతూరు వచ్చాక కూడా 'ఫాస్ట్' కల్చర్‌ను మరువలేకపోతున్నారు. వారు తినడంతో పాటు స్నేహితులకు, కుటుంబీకులకు ఈ కల్చర్ అలవాటు చేస్తున్నారు. ఇక పానీపూరి వ్యాపారులు కూడా ప్రముఖ నగరాలు వదిలి పల్లె బాట పట్టారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఉండటంతో మోస్తరు మండల కేంద్రానికి వచ్చి సెటిల్ అవుతున్నారు. పట్టణాల్లో వ్యాపారం బాగున్నా.. ఖర్చు కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాలో ఇలా...

- హిందూపురం, కదిరి మున్సిపాలిటీల్లో ఫాస్ట్ ఫుడ్ కల్చర్ ఎక్కువగా ఉంది. హిందూపురంలో పరిశ్రమలు ఉన్న కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు నార్త్ ఫుడ్‌ను ఇష్టపడుతుండటంతో గిరాకీ ఉంటోంది. అదేవిధంగా కదిరి పట్టణం పలు ప్రాంతాలకు అనుసంధానంగా ఉండటంతో జనాల రద్దీ కారణంగా పానీపూరికి డిమాండ్ పెరిగింది.
- ధర్మవరం, పెనుకొండ పట్టణాల్లో వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి జనాలు విపరీతంగా వస్తుంటారు. ఫలితంగా గోబీ, ఎగ్‌రైస్, నూడుల్స్ తదితర ఫుడ్‌కు చాలా మంది అలవాటు పడ్డారు.
- పెనుకొండ నుంచి మడకశిర వెళ్లే మార్గంలో పలు గ్రామాల్లో పానీపూరి బండ్లు వెలిశాయి. అదేవిధంగా పుట్టపర్తి నుంచి గోరంట్ల వెళ్లే మార్గంలో ఫాస్ట్ ఫుడ్ కల్చర్ విస్తరిస్తోంది. గోరంట్ల నుంచి ఓడీ చెరువు మీదుగా కదిరి వరకు పలు గ్రామాల్లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ప్రసిద్ధి చెందాయి.
- పుట్టపర్తి నుంచి కొత్తచెరువు.. బుక్కపట్నం మీదుగా చెరువు చుట్టూ ఉన్న చిన్న చిన్న గ్రామాల్లోనూ ఫాస్ట్ ఫుడ్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లా కేంద్రం కావడంతో పలు ప్రాంతాల నుంచి జనాల రద్దీ పెరిగింది. ఫలితంగా వివిధ రకాల ఫాస్ట్‌ఫుడ్ కూడా అందుబాటులో ఉండగా, జనం అలవాటు పడ్డారు.

వ్యాపారం బాగుంది



సాయంత్రం ఐదు గంటల నుంచి బండి నిర్వహిస్తుంటా. రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటా. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం విపరీతంగా వస్తుంటారు. రోజుకు రూ.1,500 పైగా వ్యాపారం అవుతోంది. కుటుంబ సభ్యులందరం పానీ పూరి బండిపై ఆధారపడి జీవిస్తున్నాం. – **కోమల్, పానీపూరి బండి నిర్వాహకుడు, తాడిమర్రి**

రుచికరంగా ఉంటోంది



నగరాలు, పట్టణాల సంస్కృతి పల్లెలకు వ్యాపించింది. మా కాలనీలో విక్రయించే పానీ పూరి, గోబీ, నూడుల్స్, ఎగ్‌రైస్ రుచికరంగా ఉంటాయి. ఇంట్లో వంటల తరహాలో చేస్తుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి పానీపూరి బండి వద్దకు వెళ్లి తిని వస్తుంటాం. – **నారాయణ, బీసీ కాలనీ, ఓడీ చెరువు**

ప్రతి వారం వస్తుంటా



మా పిల్లలు గోబీ బాగా ఇష్టపడతారు. ప్రతి వారం పిల్లలతో కలిసి పానీపూరి బండ వద్దకు వచ్చి గోబీ తింటుంటాం. ఉత్తర భారతీయులు అయినప్పటికీ ఆంధ్ర శైలిలో రుచికరంగా చేస్తున్నారు. పానీపూరి మరువలేకున్నాం. – **సురేశ్, పుల్లనారాయణపల్లి, తాడిమర్రి మండలం**

ఈ-కేవైసీకి ఆరు రోజులే గడువు

- పూర్తిచేసుకోకపోతే పథకాలు వర్తించవు
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం రైతులకు అందించే రూ.2 వేలు అందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. ఇందుకు కేవలం ఆరు రోజులే గడువు ఉందన్నారు. జూలై మొదటి వారంలో జమ కానున్న 14వ విడత పీఎం కిసాన్ నిధికి ఈ-కేవైసీ అడ్డంకిగా మారిందన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతు ఆధార్, దానికి అనుసంధానంగా ఉన్న మొబైల్ నంబర్, దానికి వచ్చే ఓటీపీ నంబర్ ఆధారంగా అథెంటికేషన్ పూర్తి చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో సంప్రదించి వేలి ముద్రలు వేసి ఈ-కేవైసీ పూర్త చేసుకోవాలన్నారు. www.pmkisan.gov.in లింకు ద్వారా లేదా ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో సైతం ఈ-కేవైసీ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు.

55,192 మంది రైతుల ఈ-కేవైసీ పెండింగ్

జిల్లాలో 2,93,100 మంది రైతులకు పీఎం కిసాన్ అకౌంట్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకూ 55,192 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదని డీఏఓ తెలిపారు. వీరంతా తక్షణమే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతుల కోసం జిల్లా కేంద్రంతో పాటు కదిరి, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం డివిజన్లలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు.

జెడ్పీలో పదోన్నతుల జాబితా సిద్ధం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే పరిపాలనాధికారులు (ఏఓ)ల పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక పదోన్నతుల విషయంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని కేడర్ల వారికి పదోన్నతులు కల్పిస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే ఈఓలు చాలా మంది ఇప్పటికే పదోన్నతులు పొందారు. తాజాగా మరికొందరికి పదోన్నతి కల్పించేందుకు జెడ్పీ అధికారులు కసరత్తు చేశారు. ఏడెనిమిది మంది ఈఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించేందుకు అవసరమైన నివేదికను జెడ్పీ అధికారులు రూపొందించారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం నివేదిక పంపారు. ఆమె పరిశీలించి, అనుమతి ఇవ్వగానే వారందరికీ ఎంపీడీఓలుగా పదోన్నతులు దక్కనున్నాయి. ఈ ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో పూర్తి కానున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులు

- 'జగనన్న సురక్ష' కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ పరిష్కారం చూపడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి తదితరులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులంతా బాధ్యతతో పని చేయాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తికర స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలన్నారు. టెక్నికల్ సమస్యలతో ఎవరికైనా పథకాలు అందకపోతే అవసరమైన పత్రాలను తీసుకుని పథకాలు అందజేయాలన్నారు. 'జగనన్న సురక్ష' క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే ఎమ్మెల్యేలకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ వివాహ, ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, నూతన రేషన్ కార్డు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పులు వంటి 11 రకాల సరిఫికెట్లు ఉచితంగా జారీ చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, జూలై 1వ తేదీ నుంచి సురక్ష క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మార్కెటింగ్ ఏడి మూర్తి, లేబర్ కమీషనర్ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు శిక్షణ

పుట్టపర్తి టౌన్: బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో స్టాఫ్ నర్సులుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టాక్ట్ ఇంటర్నేషనల్, ఏపీఎన్‌ఆర్‌టీ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) సంయుక్త ఆధ్వర్యంలో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. 35 ఏళ్ల వయస్సు కలిగి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అలాగే సాధారణ ఆస్పత్రుల్లో కనీసం రెండేళ్ల విధులు నిర్వర్తించిన అనుభవం, జర్మన్ నేర్చుకునే ఆసక్తి ఉండాలన్నారు. ఎంపికైన వారికి గుంటూరు సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో బీ-1 స్థాయి వరకు జర్మన్ బాషాపై ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత బస, వసతి ఉంటుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన తర్వాత జర్మనీలో పనిచేయుటకు ఆఫర్ లెటర్ అందజేస్తామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు జర్మనీ వెళ్లేందుకు విమాన చార్జీలు సైతం అందిస్తామన్నారు. అక్కడ ప్రారంభంలోనే వెయ్యి యూరోలు (రూ.89 వేలు) వేతనం ఉంటుందన్నారు. అనంతరం జర్మనీలో బీ-2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తరగతులు జూలై 1వ తేదీన కేఎల్ యూనివర్సిటీలో ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు 9988853335, 9398643930 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం





మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

- జిల్లా సరిహద్దులో నిఘా పటిష్టం చేయాలి
- జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి, ఇందుకు విజిలెన్స్ విభాగం పటిష్టంగా ఉండాలి' అని జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని 'స్పందన' సమావేశ మందిరంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అమలవుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ పర్యవేక్షించే డిప్యూటీ తహసీల్దార్లు బాధ్యతగా పని చేయాలన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లను తరచూ తనిఖీ చేయాలన్నారు. ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్లలో కంది బేడలు, పంచదార, ఆయిల్, రాగి మొదలైన వస్తువులు ఉన్నాయో.. లేదో పరిశీలిస్తూ ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకానికి నాణ్యమైన సరుకులు అందజేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో వినియోగదారులతో క్లబ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన చిలమత్తూరు, అమడగూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి, రొద్దం, మడకశిర, రామగిరి, అమరాపురం మండలాల్లో నిఘా పెంచాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఫైలింగ్ స్క్వాడ్ నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. 2021 నుంచి 2023 మధ్యకాలంలో 6-ఏ కేసులు జిల్లా పరిధిలో 143 నమోదయ్యాయన్నారు.

ఇంటి వద్దకే పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే అందజేసే రేషన్ సరుకులపై పర్యవేక్షణ ఉండాలని జేసీ చేతన్ ఆదేశించారు. పౌష్టికాహారం, పాలు, గుడ్లు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద మధ్యాహ్న భోజనం, వైఎస్సార్ కిట్లు, రక్త హీనతకు అందించే వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. జిల్లాలో 2,484 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటి పరిధిలోని గర్భిణులు, బాలింతలకు జూలై 1వ తేదీ నుంచి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేస్తోందన్నారు. అలాగే జిల్లాలో రాగి సాగు విస్తీర్ణం పెంచే విధంగా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. రాగులను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి, డీఎం అశ్వర్థ నారాయణ నాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీ కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, కోఆపరేటివ్ రిజిస్ట్రార్ కృష్ణా నాయక్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీటీలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు, సహకార శాఖ సీఈఓలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్... శభాష్

- చోరీకి గురైన 69 సెల్‌ఫోన్ల రికవరీ
- బాధితులకు అందజేసిన ఎస్పీ మాధవరెడ్డి


కొత్తచెరువు: చోరీకి గురైన రూ.10 లక్షలు విలువ చేసే 69 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. శుక్రవారం ఎస్పీ మాధవరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు వాటిని అందజేయగా వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ చోరీ కేసులకు సంబంధించి 231 సెల్‌ఫోన్లు రికవరీ చేసి వాటిని ఫిర్యాదుదారులకు అందించామన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 6305800426 నంబర్‌కు మొబైల్ వివరాలు వాట్సాప్ చేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందే సమాచారం చేరవేస్తారన్నారు. కార్యక్రమంలో 'దిశ' డీఎస్పీ వరప్రసాద్, సీఐ మన్సూరుద్దీన్, క్యాట్ టీం ఆర్‌ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి

నేటి నుంచి ఇంటింటి సర్వే

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమ అమలులో భాగంగా ముందుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన కీలక డాక్యుమెంట్లకు కావాల్సిన ఆధారాల సేకరణ ప్రక్రియ శనివారం నుంచి మొదలుకానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11,028 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 32,500 మంది సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు రంగంలోకి దిగనున్నట్లు జెడ్పీ సీఈఓ, గ్రామ, వార్డు సచివాలయ శాఖ నోడల్ ఆఫీసర్ కె.భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వీరిలో సచివాలయ ఉద్యోగులు 10,300 మంది, 22,200 మంది వలంటీర్లు ఉన్నారన్నారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' క్యాంపుల గురించి వివరిస్తారు. ఆ తరువాత వారికి అవసరమైన డాక్యుమెంట్ల జారీకి సంబంధించిన ఆధారాలు సేకరిస్తారు. వాటిని సచివాలయానికి తీసుకెళ్లి ఆ పత్రాలు సమర్పిస్తారు. టోకెన్ కూడా వలంటీర్లే తీసుకెళ్లి వారి ఇంటి వద్దకు చేరుస్తారు. ఏ తేదీ క్యాంపు నిర్వహిస్తారో ముందుగా తెలియజేస్తారని ఆయన తెలిపారు. క్యాంపు జరిగే రోజు అక్కడికి వెంట పిలుచుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే వరకు తోడుగా ఉంటారన్నారు. ఎటువంటి సేవా రుసుము లేకుండా 11 రకాల సేవలు పూర్తి ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు.



'పది' సప్లిమెంటరీ ఫలితాల విడుదల

ప్రశాంతి నిలయం: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 10,164 మంది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయగా, అందులో బాలురు 6,018 మంది, బాలికలు 4,146 మంది ఉన్నారు. ఇందులో 3,180 మంది బాలురు (52.84 శాతం) , 2,693 మంది బాలికలు (64.95 శాతం) కలిసి 5,873 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితంగా జిల్లా రాష్ట్రంలో 19వ స్థానంలో నిలిచింది. మార్కుల జాబితాలను ఈనెల 28 నుంచి ఎస్‌ఎస్‌సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అలాగే ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్ల స్కూల్ లాగిన్ నుంచి తాత్కాలిక మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోనేందుకు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్ కోరే విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోపు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చొప్పున చెల్లించి డీఈఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయురాలు మృతి


బేబీరాణి (ఫైల్)

పరిగి: శాసనకోట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బేబీరాణి (60) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈమె 2017 ఆగస్టు నుంచి శాసనకోట ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. గత సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో విధులు ముగించుకొని భర్త సంజీవరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నారు. శాసనకోట వైపు నుంచి కొడిగెనహళ్లి వైపు వెళ్తుండగా సుబ్బరాయనిపల్లి సమీపంలో మట్టిని తరలిస్తున్న టిప్పర్ రోడ్డుపై ఎదురుగా వచ్చింది. దాన్నుంచి తప్పించుకోబోయి దంపతులిద్దరూ కిందపడగా, రక్త గాయాలతో ఆస్పత్రిలో చేరారు. మధుమేహం, బీపీతో బాధపడుతున్న బేబీరాణి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. విశ్రాంతి తీసుకుంటుండగా, తనకు జరిగిన ప్రమాద భయంతో శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎంఈఓలు, సంఘాల నేతల నివాళి..

బేబీ రాణి మృతి వార్త తెలియగానే ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలంతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు, పాఠశాల ఉపాధ్యాయులు బేబీరాణికి నివాళు లర్పించారు. మట్టి తరలించే టిప్పర్లు విచ్చలవిడిగా శాసనకోట రోడ్డు మార్గంలో తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని, స్థానికులతో పాటు ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తెలిపారు. దీనిపై పరిగిలో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'ప్రైవేట్'కు ప్రత్యేకమా..!

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం వరకు తరగతులు
- ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం సాయంత్రం వరకు కొనసాగింపు
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు


ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనం కొత్తచెరువులోని నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అనుమతులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్నంలోపు తరగతులు ముగించాలి. అయితే విద్యార్థులు సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నారు. విద్యార్థులను అడిగితే పదో తరగతి కాబట్టి ప్రత్యేక తరగతులు ఉన్నాయని, సాయంత్రం 4.30 గంటలకు వదిలినట్లు తెలిపారు.


ఇక్కడ కనిపిస్తున్న ఫొటో కొత్తచెరువు శ్రీచైతన్య పాఠశాలలోనిది. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఈనెల 22న (గురువారం) విద్యా శాఖాధికారులు సీజ్ చేశారు. తరగతులు నిర్వహించరాదని హెచ్చరించారు. అయితే మరుసటి రోజే (శుక్రవారం) తరగతులు కొనసాగించారు. పదో తరగతి వరకు ప్రవేశాలు కూడా కల్పిస్తున్నారు. అనుమతులు రెండు రోజుల్లో వస్తాయని చెప్పుకుంటున్నారు.

సాక్షి, పుట్టపర్తి: ఎండలు తీవ్రంగా ఉండడంతో పాఠశాలలను మధ్యాహ్నం వరకే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం మాత్రం సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ నిబంధనలు బేఖాతరు చేస్తున్నాయి. అయినా విద్యాశాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఎండవేడిమికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడి కొందరు పాఠశాలలకు వెళ్లలేదు. విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతుల పేరుతో..

పదో తరగతికి ప్రత్యేక తరగతుల పేరుతో సాయంత్రం వరకు స్కూల్ నిర్వహిస్తున్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని నారాయణ పాఠశాలను అధికారులు గురువారం సీజ్ చేసినా శుక్రవారం యథావిధిగా తరగతులు నిర్వహించారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఎండవేడి లేదని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతులు కల్పించి తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాధానం ఇస్తున్నారు. ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ 8,9,10 తరగతులకు కూడా అడ్మిషన్లు ఇస్తున్నారు. తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. గతేడాది కూడా అనుమతులు లేకుండానే 8,9 తరగతులు నిర్వహించారు.

అనుమతి లేకున్నా అడ్మిషన్లు

కొత్తచెరువు మండలం కేంద్రంలోని శ్రీవిద్య స్కూల్‌కు ఈ ఏడాది అనుమతులు రాలేదు. దీనిపై విద్యా శాఖాధికారులు గురువారం ఉదయం వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. తరగతులు నిర్వహించరాదని నిర్వాహకులకు సూచించారు. అయితే మరుసటి రోజే యథావిధిగా తరగతులతో పాటు పదో తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతేడాది అనుమతులు రాకపోవడంతో అదే భవనంలో శ్రీవిద్య స్కూల్‌పేరుతో శ్రీచైతన్య యాజమాన్యం నడిపింది. ఈ ఏడాది శ్రీవిద్యకు కూడా అనుమతులు లేవు. దీంతో కొన్ని రోజుల్లోనే శ్రీచైతన్య పేరుతో అనుమతులు వస్తాయని తల్లిదండ్రులకు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



కొత్తచెరువు మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవు. విద్యార్థుల తల్లిదండ్రులు డబ్బులు కట్టి మోసపోవద్దు. తరగతులు నిర్వహించరాదని సూచించాం. ఒకట్రెండు రోజుల్లో గేటుకు తాళం వేస్తాం. అదేవిధంగా నారాయణ పాఠశాలకు ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఆ పై తరగతుల్లో ఎవరూ చేరవద్దు. నారాయణ స్కూల్‌లో 8,9,10 తరగతులు రద్దు చేస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి. పాఠశాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. – చింతా రంగస్వామి, ఇన్‌చార్జ్ డీఈఓ, శ్రీసత్యసాయి జిల్లా

ఎస్పీ కార్యాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కొత్తచెరువు: తన కుమారుడిపై పోలీసులు అక్రమంగా కేసు బనాయించారని ఓ మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం చోటు చేసుకుంది.వివరాలు.. హిందూపురానికి చెందిన వందనాబాయి పుట్టపర్తి మండలం గోనేనాయక్ తండాకు చెందిన ప్రదీప్ నాయక్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వందనాబాయి తల్లిదండ్రులు అందుకు అంగీకరించకపోగా తమ కుమార్తెను వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఇటీవల హిందూపురం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. అమ్మాయి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రదీప్ నాయక్‌పై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. దీంతో ప్రదీప్‌నాయక్ తల్లి తన కుమారుడిపై అక్రమ కేసు బనాయించారంటూ ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తనకు న్యాయం జరగలేదని శోభాబాయి ఎస్పీ కార్యాలయ ఆవరణలో పురుగుల మందు తాగింది. వెంటనే అక్కడున్న పోలీసులు ఆమెను సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతులు ఆంజనేయులు, ఇమామ్ సాబ్

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి ఇమామ్ సాబ్ (48) శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. బెంగళూరు నగరానికి చెందిన ఇమామ్‌సాబ్ కుటుంబ సభ్యులతో కలిసి బక్రీద్ పండుగకు రైలులో గుల్బర్గాకు వెళ్తున్నారు. బసంపల్లి వద్దకు రాగానే రైలులో వాటర్ షింక్ వద్ద చేతులు కడుగుతుండగా, ప్రమాదవశాత్తూ రైలు నుంచి కిందకు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లతీఫా, కుమారుడు షామీర్, ఉమైర్, కూతురు ఆశలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో...

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు (32) మృతిచెందాడు. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు..అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సారాయి ఆంజనేయులు బండల ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. లారీలో బండలు దింపేందుకు బెంగళూరుకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి బెంగళూరులో బండలు దింపి తిరిగి వచ్చే క్రమంలో తోటి కార్మికులతో గొడవ పడి అర్ధరాత్రి చెన్నేకొత్తపల్లిలో లారీ నుంచి దిగేశాడు. అంబేడ్కర్ సర్కిల్లో రోడ్డు దాటుతున్న అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

ఓడీ చెరువు: మండలంలోని గాజుకుంటపల్లి గ్రామంలో డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో వైద్య సిబ్బంది డ్రై డే సందర్భంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఆయన పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్‌నాయక్‌తో కలసి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, నీటి నిలువ, నీటితొట్టెల్లో లార్వా, పైపుల లీకేజీ, క్లోరినేషన్ తదితర వాటిపై డీఎంహెచ్‌ఓ నిశితంగా పరిశీలించారు. అనంతరం సర్పంచు బాబాఫక్రుద్దీన్, స్థానిక ప్రజలతో కలసి డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉప మలేరియా జిల్లా అధికారి లక్ష్మానాయక్, మండల విభాగ మలేరియా అధికారి దేవ్లానాయక్, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు శశిధర్,గోపినాయక్, సీహెచ్‌ఓ శుభాషిణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలున్న వారిని గుర్తించండి

బత్తలపల్లి: గ్రామాల్లో ఆశా వర్కర్లు స్పర్శలేని మచ్చ లున్న వారిని గుర్తించాలని శ్రీసత్యసాయి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు జరగనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (జాతీయ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం)లో ఆశా వర్కర్లు నిర్వహించాల్సిన సర్వేపై అవగాహన కల్పించారు. సర్వే ఫారంను ఎలా పూర్తి చేయాలో వివరించారు. అనంతరం వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గంగిరెడ్డి, సీహెచ్‌ఓ రాజశేఖర్, పర్యవేక్షక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, గౌరమ్మ, నారమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తపై టీడీపీ సానుభూతిపరుల దాడి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రూప్లానాయక్

కొత్తచెరువు: ఇంటి ముందు సైకిల్ పెట్టరాదని టీడీపీ సానుభూతిపరులు సర్పంచు గీతాబాయి భర్త రూప్లానాయక్‌పై దాడి చేశారు. వివరాలు.. మండలంలోని అప్పలవాండ్లపల్లి తండాకు చెందిన సర్పంచ్ గీతాబాయి ఇంటి ముందు టీడీపీ సానుభూతి పరులు వెంకటేష్‌నాయక్, బాలాజీ నాయక్, లలితమ్మలు ఉన్నారు. శుక్రవారం సర్పంచ్ కుమారుడు వారి ఇంటి సమీపంలోని చిన్న సందులో సైకిల్ పెట్టాడు. దీంతో ఆగ్రహించిన వెంకటేష్ నాయక్, బాలాజీ నాయక్, లలితమ్మ ఘర్షణకు దిగారు. సర్పంచు భర్త రూప్లానాయక్ తలపై కట్టెలతో దాడి చేయడంతో ఆయనకు రక్తగాయాలయ్యాయి. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండల కేంద్రంలోని దుర్గానగర్‌కు చెందిన నాగరాజు నాయక్ కుమారుడు నిఖిల్ నాయక్(19) ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. నిఖిల్‌నాయక్ చేనేత కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే యువకుడు మృతి చెందినట్లు తల్లిదండ్రులు చెప్తున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, యువకుడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ఫీ వీడియో తీసుకోగా, ఆ వీడియోను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

తనకల్లు: సుబ్బరాయునిపల్లిలో గ్యాస్ లీకై ఈశ్వరయ్యకు చెందిన ఇల్లు (బోదకొట్టం) దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, భార్య సుజాత చెరో పనికి వెళ్లారు. కాసేపటికి ఇంట్లో నుంచి పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గ్యాస్ లీకైనట్లు తెలుసుకున్న గ్రామస్తులు విషయాన్ని ఈశ్వరయ్యకు తెలిపి, మంటలు ఆర్పడానికి యత్నించారు. మంటలు అదుపులోకి రాలేదు. బీరువాలోని రూ. 30 వేలు నగదు, దుస్తులు, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి.

'సమగ్ర'లో సిమెంటు దొంగలు

- ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కీలకపాత్ర
- దాదాపు 35 లోడ్ల సిమెంటు పక్కదారి
- ఈఈ, డీఈల అధికారిక లాగిన్‌ల ద్వారా బుకింగ్
- అధికారులకు ఓటీపీ రాకుండా వారి మొబైళ్లకే వచ్చేలా జాగ్రత్తలు
- గుట్టు చప్పుడుకాకుండా విచారణ చేస్తున్న అధికారులు



రాప్తాడు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మన బడి' 'నాడు – నేడు'లో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనులకు సబ్సిడీతో సరఫరా అవుతున్న సిమెంట్ సమగ్రశిక్షలో పక్కదారి పట్టింది. దాదాపు 35 లోడ్‌ల దాకా బయట అమ్ముకున్నట్లు తెలిసింది. ఇదంతా ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేశారు. వీరి నిర్వాకం ఇటీవలే బయటపడినా అధికారులు గుట్టు చప్పుడు కాకుండా విచారణ చేస్తున్నారు. నేడోరేపో పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. నాడు–నేడు పనులకు అవసరమైన సిమెంట్ కావాలంటే ఈఈ, డీఈల అధికారిక లాగిన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టర్ల పేరుతో ఏపీ నిర్మాణ్ పోర్టల్‌కు వెళ్లి ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. ఇండెంట్ పెట్టగానే సంబంధిత ఈఈ, డీఈల మొబైళ్లకు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ చెప్పిన తర్వాతనే లోడు పంపుతారు. లోడు వచ్చిన తర్వాత సంబంధిత ప్రాంతంలో అన్‌లోడ్ చేయగానే ఇన్‌వాయిస్ (లోడు అందుకున్నట్లు) కాంట్రాక్టర్, అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇద్దరు చిన్న ఉద్యోగులు ఎవరికీ అనుమానం రాకుండా ఈ తతంగమంతా నడిపించేశారు. అధికారులకు గానీ, కాంట్రాక్టర్లకు గానీ తెలీదు. సిమెంటు మాత్రం లోడ్లు లోడ్లు బుక్ చేస్తున్నారు. వచ్చిన సిమెంటును వచ్చినట్లు బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నారు. మొత్తం సిమెంట్‌ను శ్రీసత్యసాయి జిల్లాలో వివిధ మండలాల్లో ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్లతో బుక్ చేసుకున్నారు.

వారి మొబైళ్లకే ఓటీపీ..

శ్రీసత్యసాయి జిల్లాలోని వివిధ మండలాల్లో జరుగుతున్న నిర్మాణ పనులకు అవసరమైన సిమెంట్ ఇండెంట్‌ను అక్కడి డీఈ లాగిన్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంది. జిల్లా విభజన జరిగిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లాకు లాగిన్ ఇవ్వలేదని తెలిసింది. ఇదే లాగిన్ ద్వారానే మొత్తం తతంగం నడిపారు. ఓటీపీ సంబంధిత అధికారులకు వెళ్లకుండా ఆ స్థానంలో వీరి మొబైల్ నంబర్లు పెట్టుకున్నారు. కాంట్రాక్టర్‌కు తెలీకపోయినా ఆయన పేరుమీద బుక్ చేశారు. బుక్ చేయగానే వీరి మొబైళ్లకు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన తర్వాత లోడ్లు వచ్చాయి. వాటిని అప్పటికే వీరు మాట్లాడుకున్న వారివద్దకు పంపారు. ఇక్కడ లోడు తీసుకొచ్చిన డ్రైవర్లను 'మేనేజ్' చేశారు. సబ్సిడీ సిమెంటు ఓపీసీ రకం బ్యాగు రూ. 270, పీపీసీ రకం రూ.280కు అందిస్తున్నారు. దీన్ని బయట ఒక్కో బ్యాగు రూ.40–50 వరకు అధికంగా అమ్ముకున్నట్లు తెలిసింది. ధర్మవరం ప్రాంతంలో ఎక్కువగా అమ్మకాలు చేసినట్లు సమాచారం.

కాంట్రాక్టర్ల అప్రమత్తతతో వెలుగులోకి..

ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్ల మీద వీరి వ్యవహారం నడిపారు. వీరిలో ఒక కాంట్రాక్టర్ ఏడాదికింద శ్రీసత్యసాయి జిల్లాలో పనులు చేశారు. అయితే ఆయన పేరుమీద ఇటీవలే 12 లోడ్ల దాకా బుక్ చేసినట్లు తెలిసింది. జీఎస్టీ సమస్య రానుండడంతో అప్రమత్తమైన ఆయన సమగ్ర శిక్ష అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తాను ఎక్కడా పనులు చేయడం లేదని, అయినా తనపేరుతో సిమెంట్ బుక్ చేశారని చెప్పడంతో అధికారులకు అనుమానం వచ్చింది. మరో ఇద్దరు కాంట్రాక్టర్ల పేర్ల మీద కూడా ఇదే విధంగా బుక్ చేశారు. దాదాపు ఏడాది నుంచి వీరి దందా సాగుతోంది. అనుమానం వచ్చిన అధికారులు లోతుగా విచారణ చేయడంతో ఆ ఇద్దరి ఉద్యోగుల అక్రమాలు బయటపడ్డాయి. అయితే ఈ విషయం బయట పడకుండా లోగుట్టుగా మరింత లోతుగా విచారణ సాగిస్తున్నారు.

ఈఈ శివకుమార్ ఏమంటున్నారంటే...

'శ్రీసత్యసాయి జిల్లాలో జరుగుతున్న 'నాడు–నేడు' పనుల కోసం ఈఈ, డీఈలకు తెలీకుండా వారి లాగిన్లద్వారా ఇద్దరు ఉద్యోగులు సిమెంట్ బుక్ చేసిన మాట వాస్తవమే. ఓటీపీలు మాకు రాకుండా వారి నంబర్లనే పెట్టుకున్నారు. కాంట్రాక్టర్ల పేర్లతో వారికి తెలీకుండా కొన్ని లోడ్లు బుక్ చేశారు. అవి ఎక్కడ అమ్మారు...ఎన్ని లోడ్లు బుక్ చేశారు తదితర అంశాలపై విచారణ చేస్తున్నాం. పూర్తవగానే కలెక్టర్ గౌతమి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం'.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

హిందూపురం అర్బన్: హస్నాబాద్‌లో చికెన్ కబాబ్ సెంటర్ నిర్వాహకుడు దాదాపీర్ (21) హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకేసు వివరాలను సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం వెల్లడించారు. గత నెల 21న దాదాపీర్ మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న రెండో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. దాదాపీర్‌ను స్నేహితులే హత్య చేసినట్టు గుర్తించి, ఆటోనగర్ భగీరథ సర్కిల్‌లో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దాదాపీర్, సుబహాన్, అఫీసుల్లా, మరో వ్యక్తి తౌహీద్‌లు గత నెల 21న రాత్రి పార్టీ చేసుకోవడానికి వెళ్లి అర్ధరాత్రి ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో పరిగి రోడ్డులోని ఉస్మాన్ ఎయిర్‌కూలర్ షాపు వద్ద గొడవపడ్డారు. సుబహాన్‌ను దాదాపీర్ దుర్భాషలాడడంతో కోపోద్రిక్తుడైన సుబహాన్..ఇటుకతో దాదాపీర్ తలపై బాది, ఛాతీపై తన్నాడు. దీంతో దాదాపీర్ కిందపడిపోయాడు. అక్కడే ఉన్న అఫీసుల్లా, తౌహీద్ ఇద్దరూ సుభాన్‌కు సర్దిచెప్పి, కింద పడిపోయిన దాదాపీర్‌ను తౌహీద్ ఇంటి వద్ద వరండాలో పడుకోబెట్టి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాదాపీర్ మృతి చెందాడని తెలుసుకున్న ముగ్గురూ మరుసటి రోజు రాత్రి శవం వాసన వస్తోందని గుర్తించి, కొటిపి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద దాదాపీర్ శవాన్ని ఉంచి వెళ్లిపోయారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసకుని విచారణ చేపట్టారు. స్నేహితులే హత్య చేసినట్టు తేలింది. నిందితులైన సుభాన్, ఆఫీసుల్లాను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తౌహీద్ పరారీలో ఉన్నాడు.